# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. పర్యావరణ పరిరక్షణకు, అటవీ ఉత్పత్తుల పెంపునకు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ కోరారు.**

**2. రాష్ట్రంలోని చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

**3. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నీటి పారుదల కాలువల్లో పూడిక తీత పనులకు 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.**

**4. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో 50 కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**

**5. రాష్ట్ర రాజధాని అమరావతిని వరద రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్‌డీఏ తెలిపింది.**

=============================

అటవీ సంపదను కాపాడే ప్రయత్నంలో స్మగ్లర్ల దాడుల్లో పలువురు అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ రోజు గుంటూరులోని అరణ్య భవన్‌లో జరిగిన అటవీశాఖ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరులైన అటవీ సిబ్బందికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, అటవీ ఉత్పత్తుల పెంపునకు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం, జంతు జాతులను కాపాడేందుకు అటవీశాఖ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి తెలియజేస్తూ..

...వాయిస్ (28 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలోని చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా కొలనుకొండ సమీపంలో పద్మశాలీ ఇంటర్నేషనల్

వెల్ఫేర్ అసోసియేషన్..పిఐడబ్ల్యుఎ ఆధ్వర్యంలో చేపడుతున్న నూతన పద్మశాలీ భవన్ శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరిలో అంతర్జాతీయ ప్రమాణాలతో వీవర్స్ శాల ఏర్పాటుచేసి చేనేత కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. చేనేత మహిళలకు పెద్దఎత్తున ఆధునిక రాట్నాలను పంపిణీ చేశామని తెలిపారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నీటి పారుదల కాలువల్లో పూడిక తీత పనులకు 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. పనులు ప్రారంభించే ముందే డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించాలని.. అదే విధంగా పనులు పూర్తయ్యాక మరోసారి డ్రోన్ కెమెరాతో కాలువ పనులను చిత్రీకరించాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ఆరోపణలకు ఆస్కారం ఉండదని మంత్రి నారాయణ వివరిస్తూ..

...వాయిస్...33 సెకన్లు

---------------------------

నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రయోగశాలల్లో పరికరాలు సమకూర్చేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు 12 కోట్ల 17 లక్షల 39 వేల 355 రూపాయలు మంజూరు చేయాలని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్‌కు ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో నిన్న ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో కాలం చెల్లిన అకడమిక్ ప్రయోగశాలల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గురుదీప్ సింగ్‌కు మహేష్ కుమార్ వివరించారు.

---------------------------

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో 50 కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో నిన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు.. ఎంఎస్‌ఎంఈల రిజిస్ట్రేషన్ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనే మొదటిసారి మచిలీపట్నంలో ఇలాంటి కార్యశాల ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 100 ఎకరాల్లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు అభివృద్ధి చేయాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.. త్వరలోనే మచిలీపట్నంలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు అవసరమైన స్థలం ఏర్పాటు చేస్తామని మంత్రి రవీంద్ర పేర్కొంటూ..

... వాయిస్ ...32సెకన్లు

---------------------------

రాష్ట్ర రాజధాని అమరావతిని వరదరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్‌డీఏ తెలిపింది. వందేళ్ల వర్షపాతాన్ని పరిశీలించి టాటాకన్సల్టింగ్ ఇంజనీర్లు, నెదర్లాండ్స్ సంస్థ నివేదిక ఇచ్చిందని వెల్లడించింది. వరద నిర్వహణకు అమరావతిలో ప్రవహిస్తున్న

వాగులను విస్తరిస్తామని పేర్కొంది. కొండవీటి వాగు, పాలవాగుల లోతు.. వెడల్పు పెంచుతామని వెల్లడించింది. వరద నిర్వహణ ప్రణాళిక ఆకృతిని సాంకేతిక కమిటీ ఆమోదించిందని.. అందుకు అనుగుణంగా రాజధానిలో వరద నిర్వహణ పనులకు 2 వేల 62 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించామని తెలిపింది.

---------------------------

భారతరత్న, స్వతంత్ర భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని పురస్కరించుకొని రేపు మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. మైనార్టీ సంక్షేమ శాఖ తరఫున విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి జీవిత సాఫల్య పురస్కారం, విశిష్ఠ సేవలు అందించిన ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అవార్డులు, సాంస్కృతిక కళా రంగాల్లో సేవలందించిన వారికి విశిష్ఠ పురస్కారాలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

---------------------------

గుంటూరు జిల్లా తాడికొండలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని, నూతనంగా నిర్మించిన ఉపాధ్యాయుల వసతిగృహాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలువురు ముఖ్యమంత్రులు కుగ్రామాల నుంచి, ముఖ్యంగా తాడికొండ గురుకుల పాఠాశాల వంటి విద్యాలయాల నుంచి వచ్చినవారేనని గుర్తు చేశారు. ఆ పాఠశాల అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థుల దృక్పథం మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందన్న పెమ్మసాని చంద్రశేఖర్.. ప్రతి గ్రామంలో పాఠశాల, కమ్యూనిటీ హాల్స్, వాకింగ్ ట్రాక్ తదితర కనీస వసతులు కల్పించేందుకు ఐదు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఈ నెల 24, 25వ తేదీల్లో కలెక్టర్ల సదస్సు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారి జరిగిన కలెక్టర్ల సమావేశంలో చర్చించిన, తీసుకున్న నిర్ణయాలకు తగిన విధంగా పురోగతి వివరించేలా నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడిచిన నాలుగు నెలల్లో ప్రభుత్వ శాఖల వారీగా నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 32 సెకన్లు....

=====================